

కలెక్టరేట్‌లో అర్జీలు తీసుకుంటున్న కలెక్టర్ తదితరులు(ఫైల్ ఫొటో)

ఫిర్యాదుల్లో తృతీయస్థానం

- పరిష్కారంలో 19.62/20 పాయింట్లు
- ఏడు నెలల్లో 41వేలకు పైగా అర్జీలు
- సీఎంవోకూ అందుతున్న వినతులు

గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు చేసిన దౌర్జన్యాలతో పాటు ప్రభుత్వం చేపట్టిన రీసర్వే, పట్టాల పంపిణీ కార్యక్రమాలపై ప్రజలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారు.ఈ ఫిర్యాదుల విషయంలో జిల్లాకు రాష్ట్రంలో మూడో స్థానం దక్కిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వచ్చిన ఫిర్యాదుల్లో 75 శాతం రెవెన్యూ సమస్యలే వుండడం గమనార్హం.గతేడాది జూన్ 15వ తేదీ నుంచి ఈ నెల 6వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికతో పాటు వివిధ కార్యక్రమాల్లో అందిన సమస్యలను ప్రభుత్వం ఇటీవల విశ్లేషించింది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

● మొత్తం ఫిర్యాదులు 41,186

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్ డేతో పాటు ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించే కార్యక్రమాల కింద 41,186 ఫిర్యాదులందాయి.వీటిలో రెవెన్యూ (సీసీఎల్‌ఏ)కు సంబంధించినవే 20,116 ఉన్నాయి. రెవెన్యూ శాఖలోనే విడిగా సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ సమస్యలపై 10,437 ఫిర్యాదులందాయి. పోలీసు శాఖకు 1578, పంచాయతీరాజ్‌కు 999, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు 809, సివిల్ సప్లయిస్‌కు 317, హౌసింగ్‌కు 210 ఫిర్యాదులందాయి.

● 25 వేల కుటుంబాల నుంచి వినతులు

జిల్లాలో 25 వేల కుటుంబాలు సమస్యలతో ఇబ్బంది పడుతూ ప్రభుత్వానికి పరిష్కారం కోరుతూ వినతులు పంపుతున్నట్లు తాజా విశ్లేషణ వెల్లడిస్తోంది. హౌస్ హోల్డ్ గ్రీవెన్స్ డిస్ట్రిబ్యూషన్ పేరిట ప్రభుత్వం జరిపిన విశ్లేషణతో ఈ అంశాలు వెలుగు చూశాయి. ఈ అంశంలోనూ జిల్లా మూడో స్థానంలో ఉంది. శ్రీకాకుళం, కర్నూలు జిల్లాల తర్వాత మన జిల్లాలోనే అత్యధిక కుటుంబాలు పలు రకాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాయి. జిల్లాకు సంబంధించిన 25,529 కుటుంబాలు ఏదో ఒక సమస్య ఎదుర్కొంటున్నాయి.5214 కుటుంబాలు 2నుంచి 3 సమస్యలతో, 492 కుటుంబాలు 4నుంచి5 సమస్యలతో, 157 కుటుంబాలు 6నుంచి 10 సమస్యలతో, 26 కుటుంబాలు పదికిపైగా సమస్యలతో ఇబ్బంది పడుతున్నాయి.

● సీఎంవోకు అందిన ఫిర్యాదుల్లో ఏడవ స్థానం

సీఎం దృష్టికి వెళితే సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిస్తూ పలువురు ఆయన కార్యాలయానికే ఫిర్యాదులు చేస్తున్నారు. ఇలా సీఎంవోకు మన జిల్లా నుంచి 698 ఫిర్యాదులందాయి. ఈ అంశంలో జిల్లా ఏడో స్థానంలో నిలిచింది. పొరుగున ఉన్న అన్నమయ్య జిల్లా 1047 అర్జీలతో మూడవ స్థానంలో, తిరుపతి జిల్లా 935 అర్జీలతో నాల్గవ స్థానంలో ఉన్నాయి.

● ఐదు అంశాల్లో లభించిన పాయింట్లు

ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల్లో వాటి పరిష్కారాల శాతం ఆధారంగా జిల్లాలకు ప్రభుత్వం పాయింట్లను ప్రకటించింది. ఆ స్కోర్ బోర్డులో మొత్తం వంద పాయింట్లుండగా.. 20 పాయింట్ల చొప్పున ఐదు అంశాలుగా విభజించింది. జిల్లాకు సంబంధించి మొత్తం వచ్చిన ఫిర్యాదుల పరంగా 10.72 పాయింట్లు, పరిష్కారానికి సంబంధించి 19.62 పాయింట్లు, పరిష్కారం తాలూకు నాణ్యతకు 13.23 పాయింట్లు, సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు తదితర ముఖ్యుల ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారం విషయంలో 19.15 పాయింట్లు, ఆ పరిష్కారాల తాలూకా నాణ్యతకు 8.32 పాయింట్లు లభించాయి. ఇవే అంశాలకు సంబంధించి గత నెలలో పరిశీలిస్తే వరుసగా 9.48, 19.87, 14.42, 19.27, 7.14 పాయింట్ల చొప్పున లభించాయి.



సంకటహర గణపతి వ్రతంలో పాల్గొన్న భక్తులు

స్వర్ణరథంపై వరసిద్ధుడు

కాణిపాకంలో ఆదివారం సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేసి సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుడి ఉత్సవ విగ్రహాలను ఆలయ ఆస్థాన మండపానికి తీసుకొచ్చారు.వేదికపై ఉత్సవ విగ్రహాలను కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు.అనంతరం ఉత్సవ విగ్రహాల ఎదుట భక్తులను కూర్చోబెట్టి సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను స్వర్ణరథంపై ఉంచి ఆలయ మాడవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచల కిషోర్,ఈఈ వెంకటనారాయణ,ఏఈవోలు ప్రసాద్, రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు,రవి, ఎస్‌ఐ ధరణీధర తదితరులు పాల్గొన్నారు.

- ఐరాల(కాణిపాకం),ఆంధ్రజ్యోతి



స్వర్ణ రథంపై మాడ వీధుల్లో విహరిస్తున్న వరసిద్ధుడు

చిత్తూరు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ బోర్డు మార్చి ఒకటి నుంచి నిర్వహించే పబ్లిక్ పరీక్షలకు సంబంధించి తొలి విడత ప్రశ్నపత్రాలు విజయవాడ నుంచి ఆదివారం చిత్తూరుకు చేరాయి. స్థానిక పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూం వద్దకు చేరిన ప్రశ్నపత్రాల కంటైనర్‌ను జిల్లా పరీక్షల కన్వీనర్, జిల్లా ఒకేషనల్ విద్యాధికారి సయ్యద్‌మౌల, డీఎస్పీ సాయినాథ్, పరీక్షల ప్రత్యేక అధికారి దయానందరాజు, డిస్ట్రిక్ బల్క్ ఇన్‌చార్జి హేమలత పరిశీలించారు. జిల్లా పరీక్షల ప్రత్యేక అధికారి స్ట్రాంగ్‌రూమును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ప్రశ్నపత్రాలను కమిటీ సభ్యుల సమక్షంలో అందులో భద్రపరిచారు. ఈ సందర్భంగా పరీక్షల కన్వీనర్, డీవీఈవో సయ్యద్ మౌలా మాట్లాడుతూ సెట్ వన్‌లో ఒకేషనల్, జనరల్ ప్రశ్నపత్రాలు వచ్చాయని,



ప్రశ్నపత్రాల కంటైనర్‌ను పరిశీలిస్తున్న డీవీఈవో సయ్యద్‌మౌలా, డీఎస్పీ సాయినాథ్

సెట్ 2, 3 రావాల్సి ఉందన్నారు. వీటిని ఈనెల 24, 25 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన నాలుగు రూట్లలో 29 పోలీసు స్టేషన్లలో ప్రశ్నపత్రాలు భద్రపరచనున్నట్లు చెప్పారు. కాగా మార్చి ఒకటి నుంచి 17వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 139 మంది కళాశాలల్లోని 30,713 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు వీలుగా 50 పరీక్షా కేంద్రాలు ఎంపిక చేశామన్నారు. ప్రశ్నపత్రాల పరిశీలనలో కమిటీ సభ్యులు నిర్మలాకుమారి, బాలసుబ్రమణ్యం ఉన్నారు. కాగా ఈనెల 10 నుంచి మొదలైన ప్రాక్టికల్స్ పరీక్షలు 20వ తేదీ వరకు కొనసాగనున్నాయి. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో జిల్లాలోని 30 కేంద్రాల్లో చేపట్టిన ప్రాక్టికల్స్ ఆదివారం కూడా కొనసాగాయి. పబ్లిక్ పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా పరీక్షల కన్వీనర్, జిల్లా ఒకేషనల్ విద్యాధికారి సయ్యద్‌మౌలా, పరీక్షల ప్రత్యేక అధికారి దయానందరాజు తెలిపారు.



పరుగులు తీస్తున్న కోడెగిత్త

కోలాహలంగా మైలేరు పండుగ



మొదటి బహుమతి గెలుచుకున్న ఎద్దు

బైరెడ్డిపల్లెలో ఆదివారం మైలేరు పండుగ కోలాహలంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన కోడెగిత్తలను తిలకించడానికి అధికసంఖ్యలో జనం తరలిరావడంతో బైరెడ్డిపల్లెలోని వీధులు కిక్కిరిశాయి. గ్రామస్తులు పశువులను వదిలేచోట దారిపొడవునా బారికేడ్లు ఏర్పాటుచేశారు. అలాగే పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేయడంతో మైలేరు పండుగ ప్రశాంతంగా ముగిసింది. పరుగుపందెంలో గెలుపొందిన పశువులకు సంబంధించిన యజమానులకు గ్రామస్తులు ప్రోత్సాహక నగదు బహుమతులందజేశారు.రామకుప్పం మండలం కెంపసముద్రానికి చెందిన శంకరప్ప అనే రైతు ఎద్దు ఓం శక్తి మొదటి బహుమతి సాధించింది.నిర్దేశిత లక్ష్యాన్ని 8.29 సెకండ్లలో అధిగమించి రూ. 2.11 లక్షల ప్రైజ్‌మనీని గెల్చుకుంది. తమిళనాడులో జరిగిన పలు పోటీల్లోనూ తన ఎద్దు పలుమార్లు నగదు బహుమతులు తెచ్చిపెట్టినట్లు శంకరప్ప తెలిపారు.



హాజరైన జనం

- బైరెడ్డిపల్లె/రామకుప్పం, ఆంధ్రజ్యోతి

టెన్త్ విద్యార్థిని ప్రసవం

● బిడ్డ క్షేమం..తల్లి మృతి..పోక్సో కేసు నమోదు

గంగవరం,ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):పలమనేరు మండలానికి చెందిన ఓ 10వ తరగతి విద్యార్థిని బిడ్డకు జన్మనిచ్చి మృతి చెందడం చర్చనీయాంశమైంది. పోలీసుల కథనం మేరకు..శనివారం బంగారుపాళ్యం వెళ్లిన ఆ బాలికకు మూర్ఛ రావడంతో హుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేశారు. చిత్తూరులో పరీక్షలు చేసి ఆమె గర్భవతి అని నిర్ధారించారు.ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీశారు.బిడ్డ క్షేమంగానే ఉన్నాడు కానీ ఆపరేషన్ తరువాత బాలిక అపస్మారక స్థితికి చేరడంతో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది.దీంతో పలమనేరు పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు.ఆ బాలిక గర్భం దాల్చడానికి, మృతిచెందడానికి కారణం ఎవరనేది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి వుంది.





మృతులు ప్రదీప్, ఉమేష్‌గురుంగ్

ద్విచక్ర వాహనాల ఢీ.. ఇద్దరి మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు

గంగవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు మృతిచెందగా.. మరొకరికి తీవ్రగాయాలైన సంఘటన గంగవరం మండలం నాలుగురోడ్లు- పుంగనూరు రహదారిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అరుణాచల్ ప్రదేశ్ దిరాంగమ్ గ్రామానికి చెందిన ఉమేష్ గురుంగ్ గంగవరం మండలం గండ్రాజుపల్లె సమీపంలోని ఓ పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఆదివారం తన బావమరిది అరుణ్ గురుంగ్‌ను తీసుకొని ద్విచక్రవాహనంపై పుంగనూరు రహదారి వైపు బయల్దేరాడు.పెద్దపంజాణి మండలం శివాడి గ్రామానికి చెందిన ప్రదీప్‌కుమార్ ద్విచక్రవాహనంపై ఎదురుగా వస్తున్నాడు. సరమట్లపల్లి సమీపంలోని మలుపు వద్ద ఈ రెండు వాహనాలూ ఎదురెదురుగా ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో ఉమేష్‌గురుంగ్(31)కు, ప్రదీప్‌కుమార్(30)కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. అరుణ్‌గురుంగ్(21) తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న గంగవరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు సీఐ ప్రసాద్ తెలిపారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆదివారం సాయంత్రం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. మృతి చెందిన ఉమేష్‌గురుంగ్, ప్రదీప్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఆస్పత్రి కమిటీ ఛైర్మన్ నాగరాజు,రాము తదితరులు పాల్గొన్నారు.



గాయపడిన అరుణ్‌గురుంగ్


నేడు 'పీజీఆర్‌ఎస్'

చితూరు అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. మండల, నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

● జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్‌ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరిస్తారని తెలిపారు.

మామిడి రైతుల్లో చిగురించిన ఆశలు

రొంపిచెర్ల, ఫిబ్రవరి16 (ఆంధ్రజ్యోతి): మామిడి చెట్లలో మంచి పూత రావడంపై రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.అయితే వారం రోజుల నుంచి దట్టంగా పొగ మంచు కురుస్తుండడంతో పూత మాడిపోతుందేమోనని, తెగుళ్లు ఆశిస్తాయని ఆందోళన పడుతున్నారు. చౌడేపల్లె మండలంలో 2500 ఎకరాల్లో, సదుంలో 5500 ఎకరాల్లో, పులిచెర్లలో 12000ఎకరాల్లో, రొంపిచెర్ల మండలంలో 5200 ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. సాధారణంగా డిసెంబరు మొదటి వారం నుంచి మామిడి చెట్లు పూతకు వస్తుంటాయి. కానీ గత ఏడాది నవంబరుతోపాటు డిసెంబరు మొదటి వారంలో కూడా వర్షాలు పడడంతో పూత రావడం ఆలస్యమైంది. ఈనెల సగం నుంచి తోటలు పూత పూస్తున్నాయి. 19రోజులుగా దట్టంగా పొగమంచుకుస్తుండడంతో పూత మాడిపోతుందని మామిడి సాగుదారులు వాపోతున్నారు. రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానశాఖ అధికారి సంతోష్‌కుమారి సూచించారు. మామిడిలో తేనె మంచు, తామర, కాయతొలుచు పురుగు, ఆకుమచ్చ, బూడిద తెగుళ్లు ఆశిస్తాయని చెప్పారు. వీటిని నియంత్రించడానికి పురుగు మందులతో పాటు పోషకాలు కూడ అందించాలని చెప్పారు. లీటరు నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్, ఐదు గ్రాముల యూరియా కలిపి కొమ్మలన్నీ తడిచేలా పిచికారి చేయాలన్నారు. బోరాన్ లోపం ఉన్నట్లయితే లీటరు నీటికి రెండు గ్రాముల చొప్పున బోరాన్ కలిపి పిచికారి చేయాలన్నారు.



రొంపిచెర్ల మామిడితోటలో చెట్టు నిండా పూత

ఐటీసీఎక్స్ సదస్సుకు తిరుపతి సిద్ధం

● సీఎం చంద్రబాబు సహా గోవా, మహారాష్ట్ర ముఖ్యమంత్రుల రాక

తిరుపతి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దేవాలయాల సదస్సు తిరుపతి వేదికగా నేడు మొదలుకానుంది. ఇంటర్నేషనల్ టెంపుల్స్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో(ఐటీసీఎక్స్) పేరిట టెంపుల్ కనెక్ట్ సంస్థ మంగళం రోడ్డులోని ఆశా కన్వెన్షన్ సెంటర్లో మూడు రోజుల పాటు ఈ సదస్సు నిర్వహించనుంది. సోమవారం సాయంత్రం 4 గంటలకు జరిగే ప్రారంభ సభకు ఏపీ సీఎం చంద్రబాబు , మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, గోవా సీఎం ప్రమోద్ సావంత్, కేరళ గవర్నర్ రాజేంద్ర అర్లేకర్, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి సీఆర్ ముకుంద్ తదితరులు హాజరుకానున్నారు. మంగళ, బుధవారాల్లో ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు సమావేశాలు జరుగుతాయి.శ్రీవారి ఆలయ పాలనపరమైన అంశాలపైనా సదస్సులో చర్చించనున్నారు. దేవాలయ పరిపాలన, నిర్వహణపై జరిగే ఐటీసీఎక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆలయాల ప్రతినిధులు హాజరవుతున్నట్లు టెంపుల్ కనెక్ట్ వ్యవస్థాపకుడు గిరేష్ కులకర్ణి ఆదివారం మీడియాకు చెప్పారు. ఎక్స్‌పో ఛైర్మన్, మహారాష్ట్ర శాసన మండలి చీఫ్ విప్ ప్రసాద్ లాడ్ మాట్లాడుతూ.. దేవాలయ ఆర్థిక వ్యవస్థను అనుసంధానం చేయడం, భక్తులకు సౌలభ్యాన్ని పెంచడం తదితరాలపై ప్రధానంగా చర్చ ఉంటుందన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు, తొక్కిసలాట జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రసాదాల నాణ్యతకు అధునాత ల్యాబ్‌లు, వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్ పద్ధతులపై మాస్టర్ క్లాస్‌లు ఉంటాయన్నారు. ఆలయ ట్రస్టుల ద్వారా విద్య, వైద్యం, ధార్మిక సేవాకార్యక్రమాల నిర్వహణపైనా చర్చ జరుగుతుందన్నారు.



ఐటీసీఎక్స్‌కు సిద్ధమైన వేదిక

వరసిద్ధుడి దర్శనానికి నాలుగు గంటల సమయం



వరసిద్ధుడి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టింది. ఆదివారం సెలవు, సంకటహర చతుర్థి కావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వరసిద్ధుడి దర్శనానికి ఆలయానికి విచ్చేశారు. దీంతో క్యూలైన్లు పూర్తిగా భక్తులతో నిండి పోయాయి. ఇబ్బందులు తలెత్తకుండా ఈవో పెంచలకిషోర్ పర్యవేక్షించారు. భక్తులకు ఆలయ సిబ్బంది తాగునీటిని అందించారు.

లోకేశ్‌ను కలసిన వెటర్నరీ విద్యార్థులు



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న వెటర్నరీ విద్యార్థులు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని కోరుతూ ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు చేపట్టిన దీక్షలో భాగంగా ఆదివారం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తిరుపతి ఎయిర్‌పోర్టులో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రమణ్యంతో కలిసి తమ సమస్యలను మంత్రికి వివరించారు. మంత్రి అచ్చెన్నాయుడితో చర్చించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తామని లోకేశ్ వారికి హామీ ఇచ్చారు.

మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



తిరుపతి(క్రీడలు), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపికైంది. ఆదివారం యూత్ హాస్టల్లో జరిగిన సర్వసభ్య సమావేశంలో గౌరవాధ్యక్షుడిగా డాక్టర్.పి.హరికృష్ణ, అధ్యక్షురాలిగా ఎల్.సుశీలమ్మ, కార్యదర్శిగా ఎ.రమణ, కోశాధికారిగా ఎం.దీపికలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు టీటీడీ డీఈ జి.నారాయణప్ప తెలిపారు. హరికృష్ణ మాట్లాడుతూ 35 సంవత్సరాలు పైబడిన వారు అసోసియేషన్‌లో సభ్యత్వం తీసుకుని క్రీడలలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. నూతన కార్యవర్గాన్ని పలువురు క్రీడాకారులు అభినందించారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధనరాజు, జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్)/రేణిగుంట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు సోమవారం తిరుపతి రానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు పరిశీలించారు. ఆదివారం రాత్రి విమానాశ్రయం నుంచి మంగళం వరకు సీఎం పర్యటించే ప్రాంతాలను ఎస్పీ హర్షవర్ధనరాజు, జేసీ శుభం బన్సల్ పరిశీలించారు. విమానాశ్రయంలో అధికారులతో సమీక్ష నిర్వహించి, మంగళం రోడ్డు ఆశా కన్వెన్షన్‌లో జరిగే అంతర్జాతీయ దేవాలయాల సమ్మేళనం ఏర్పాట్లు పరిశీలించారు. ట్రైనీ ఎస్పీ హేమంత్, ఏఎస్పీలు శ్రీనివాసరావు, రవిమనోహరాచారి, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, డీఎంహెచ్‌వో బాలాజీనాయక్, రుయా సూపరింటెండెంట్ రవిప్రభు, జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య పాల్గొన్నారు.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం

- శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి ఉత్సవాలపై హోం మంత్రి సమీక్ష

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యం కల్పించాలని అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేసినట్టు హోంమంత్రి అనిత తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలన భవనంలో ఆదివారం ఆమె ఉత్సవాల ఏర్పాట్లపై పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ఉత్సవాల్లో సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా అధికారులు పనిచేయాలన్నారు. స్వామి, అమ్మవార్లకు ఈనెల 25న సీఎం చంద్రబాబు పట్టు వస్త్రాలు సమర్పించే అవకాశం ఉందన్నారు. వీఐపీలకు ప్రత్యేక టైంస్లాట్ కేటాయించడంతో పాటు భక్తుల కోసం వైద్యబృందాలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు, భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా పెడతామన్నారు. 13రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ఈ ఏడాది భక్తులందరికీ లడ్డూ ప్రసాదంతో పాటు నీళ్ల బాటిళ్లను ఉచితంగా సరఫరా చేస్తామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. స్థానికులకు ప్రత్యేక ఉచిత దర్శనం కల్పిస్తున్నామన్నారు. ఏర్పాట్లపై అన్నిశాఖల అధికారులతో సమన్వయం చేసుకున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. అంతకుముందు స్వామి అమ్మవార్లను హోంమంత్రి అనిత దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధిలో మంత్రిని శేషవస్త్రంతో సత్కరించి ఆశీర్వచనం ఇచ్చారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అంగన్వాడీలకు అవార్డులు

- 29 పంచాయతీల్లోని 70 కేంద్రాలను ఎంపిక చేసి కేంద్రానికి నివేదిక
- ఎంపికైతే ఒక్కో పంచాయతీకి రూ.లక్ష విడుదలవుతుంది



చిత్తూరులోని బౌండువీధి అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం తింటున్న చిన్నారులు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదలకు పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇప్పటికే స్త్రీ- శిశు సంక్షేమశాఖ ద్వారా పోషణ్ అభియాన్, సక్షం, పోషణ్ 2.0 కార్యక్రమాలను అమలు చేస్తుంది.

ఇప్పుడు 'సుపోషిత' పథకంతో..

జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించడానికి కేంద్ర ప్రభుత్వం సుపోషిత పంచాయతీ అభియాన్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసి అవార్డులను ఇవ్వనున్నారు. ఇందుకు కేంద్రాల పనితీరు ప్రామాణికంగా తీసుకుంటారు. ఎంపికైన పంచాయతీకి రూ.లక్ష చొప్పున ఇస్తారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 697 పంచాయతీల్లోని 32 మండలాల్లో 2,420 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 29 పంచాయతీల్లోని 70 కేంద్రాలను జిల్లా అధికారులు ఎంపిక చేసి, కేంద్రప్రభుత్వానికి నివేదికలు పంపారు.

యాప్‌ల నిర్వహణే కీలకం

అవార్డుల ఎంపికకు అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది నిర్వహించే యాప్‌లే కీలకం కానున్నాయి. ఇందులోనూ పోషణాట్రాకర్ యాప్ మరింత ప్రధాన పాత్ర పోషించనుంది. యాప్‌లలో కేంద్రాల నిర్వహణ, లబ్ధిదారుల వివరాలు, చిన్నారుల ఎదుగుదల, బరువు, పోషకాహారం పంపిణీ, సిబ్బంది పనితీరు, గర్భిణులు, బాలింతలు తదితర అంశాలు నమోదై ఉంటాయి. వీటి ఆధారంగానే అవార్డులను ఇవ్వనున్నారు.

రూ.లక్ష వినియోగం ఇలా..

ఈ పథకం ద్వారా ఎంపికైన పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్షలో- వర్కర్, హెల్పర్‌లకు 25 శాతం, గ్రామ, పట్టణాల్లో చైతన్య కార్యక్రమాలకు 25 శాతం, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పోషణ వాటికల కోసం 50 శాతం ఖర్చు చేయాలి.

70 అంగన్వాడీ కేంద్రాల వివరాలు పంపాం



29 పంచాయతీలోని 70 అంగన్వాడీ కేంద్రాలను ఎంపిక చేశాం. వీటిపై నివేదికలు కేంద్ర ప్రభుత్వానికి పంపాం. ఇప్పటికే ఆయా కేంద్రాల వద్ద పారిశుధ్యం, శిశు, మాతృ మరణాలు లేకుండా చేస్తున్నాం. పిల్లల హాజరుశాతం, తల్లిదండ్రుల భాగస్వాములయ్యేలా చూస్తున్నాం.

- వెంకటేశ్వరి, పీడీ, ఐసీడీఎస్

కాపు భవన్ నిర్మాణానికి రూ.50 లక్షల విరాళం



రాయల విగ్రహానికి నివాళులర్పించి వీరఖడ్గాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర పరిధిలో ఉన్న కాజూరు చెరువును బలిజ సంఘం నేతల కోరిక మేరకు శ్రీకృష్ణదేవరాయల లేక్‌గా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చెప్పారు. శ్రీకృష్ణదేవరాయల 555వ జయంతి వేడుకలను ఆదివారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఆయన రాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశేష సేవలందించిన మహనీయుల విగ్రహాలను చెరువు చుట్టూ ఏర్పాటు చేసి ట్యాంక్ బండ్‌లా తయారు చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వం నుంచి కాపు భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తన వంతు విరాళంగా రూ.50 లక్షలు ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, నాయకులు బద్రి నారాయణ, కాజూరు బాలాజీ, ఆరణి కవిత, అభ్యుదయ సేవా సంఘం నేతలు ఓఎం రామదాసు, రెడ్డప్ప, పూలచందు, రెడ్డిగుంట కిశోర్, కోలా కిరణ్, బలిజ కులస్తులు పాల్గొన్నారు.

గంగమ్మ నామస్మరణతో కిక్కిరిసిన బోయకొండ



ప్రత్యేకాలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం గంగమ్మ భక్తుల అమ్మవారి నామస్మరణతో మార్మోగింది. ఉదయం ఆలయంలో అర్చకులు వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, అర్చనల అనంతరం స్వర్ణాభరణాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.



అమ్మవారి దర్శనం కోసం వేచిఉన్న భక్తులు

మినిమం టైమ్ స్కేల్ కోసం ఉద్యమించాలి



సదస్సులో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ వర్తింపు కోసం ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రప్రదేశ్ ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ ఏవీ నాగేశ్వరరావు అన్నారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం యూనియన్ తిరుపతి జిల్లా సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైంస్కేల్ అమలు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని ఆప్కాస్‌ను రద్దు చేసి కాంట్రాక్టర్లకు అప్పగించాలని నిర్ణయం తీసుకోవడం అన్యాయమన్నారు. ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యోగులకు భద్రత ఉండదన్నారు. కాంట్రాక్టు కార్మికుల ఉద్యోగ భద్రత కోసం జేఏసీ ఆధ్వర్యంలో పోరాటాలు చేయాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్ ధనలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు జీ నాగవెంకటేష్, జయచంద్ర, జి.చిన్నబాబు, గంగయ్య, రాజేంద్ర, నారాయణమ్మ, చంద్రమ్మ, నిర్మల పాల్గొన్నారు.

ముగ్గురు సీఎంల రాకతో

తిరుపతిలో పటిష్ఠ బందోబస్తు



కన్వెన్షన్ సెంటర్ వద్ద ఏర్పాట్లు, బందోబస్తుపై చర్చిస్తున్న ఎస్పీ, జేసీ, కమిషనర్

తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి: తిరుపతికి సోమవారం ఏపీ, గోవా, మహారాష్ట్ర సీఎంలు చంద్రబాబు, ప్రమోద్ సావంత్, దేవేంద్ర ఫడ్నవీస్, పలువురు వీవీఐపీలు రానున్నారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరిలో గోవా, మహారాష్ట్ర సీఎంలు తిరుమలకూ వెళ్లనున్నారు. దీంతో తిరుమలలోనూ భద్రతపై దృష్టి పెట్టారు. ఆదివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయం నుంచి అడ్వాన్స్‌డ్ లైజన్ సెక్యూరిటీ నిర్వహించారు. సదస్సు జరిగే ఆశ కన్వెన్షన్ సెంటరు వద్ద డీఐజీ షిమోసీ, ఎస్పీ హర్షవర్ధనరాజు నేతృత్వంలో ముగ్గురు అదనపు ఎస్పీలు, 12 మంది డీఎస్పీలు, 25 మంది సీఐలు, 70 మంది ఎస్‌ఐలు, మరో 800 మంది సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. ఇప్పటికే బాంబు, డాగ్ స్క్వాడ్లు ఆశ కన్వెన్షన్ సెంటరులో తనిఖీలు చేశారు. ఎస్పీ, జేసీ శుభం బన్సల్, కమిషనరు మౌర్య తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. తిరుపతిలోని వివిధ విద్యాసంస్థలు, హోటళ్లకు ఇటీవల బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన నేపథ్యంలో పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తమైంది.

సీఎంల పర్యటన ఇలా..

- ఏపీ సీఎం చంద్రబాబు సోమవారం మధ్యాహ్నం 3.15 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.45 గంటలకు ఆశ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని సాయంత్రం 6.15 గంటల వరకు ఉంటారు.
- మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ సోమవారం ఉదయం 8.45 గంటలకు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ్నుంచి తిరుమలకు వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటారు. 3.10 గంటలకు బయలుదేరి తిరుపతిలో సదస్సుకు వస్తారు. ఈ కార్యక్రమం చూసుకుని రాత్రి ఏడు గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.
- గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ మధ్యాహ్నం 12.05 గంటలకు విమానాశ్రయానికి.. 1.30 గంటలకు తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటారు. సాయంత్రం 4 గంటలకు తిరుపతిలో జరిగే కార్యక్రమంలో పాల్గొని.. 7.50 గంటలకు విమానాశ్రయం నుంచి హైదరాబాదుకు వెళతారు.

టీఎల్‌సీ తిరుపతి చాప్టర్ ప్రారంభం



సమావేశంలో టీఎల్‌సీ మాస్టర్‌మైండ్స్ చాప్టర్ ప్రతినిధులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): టీఎల్‌సీ మాస్టర్‌మైండ్స్ తిరుపతి చాప్టర్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రపంచ కార్యకలాపాల వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీసుందరం, కార్యనిర్వాహణాధికారి గుణశేఖర్ ప్రకటించారు. ఆదివారం ఓ హోటల్లో జరిగిన కార్యక్రమంలో టీఎల్‌సీ(టీచర్స్ లీడర్స్ కమ్యూనిటీ) మాస్టర్‌మైండ్స్ తిరుపతి చాప్టర్ ఉపాధ్యక్షులుగా ఎస్.సుబ్రహ్మణ్యంరాజును నియమించారు. వ్యాసరచనలో శిక్షణ తరగతులను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. తిరుపతి నుంచి కనీసం వెయ్యి మంది రచయితలుగా మారడానికి, వారి జ్ఞానాన్ని ప్రపంచంతో పంచుకోవడానికి కృషి చేస్తామన్నారు. ఆసక్తిగలవారు 7993003936ను సంప్రదించాలని ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యంరాజు కోరారు.







పశువుల నిలువరిస్తున్న యువకులు, జల్లికట్టుకు విచ్చేసిన సినీనటుడు మంచు మనోజ్

పట్టుకో.. పట్టుకో

- ఉత్సాహం ఉరకలేసిన జల్లికట్టు
- పశువులను నిలువరింతలో పలువురికి గాయాలు



కింద పడి గాయపడిన వారికి చికిత్స అందిస్తున్న వైద్యులు

చంద్రగిరి, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. మధ్యాహ్నం రెండు గంటలకు మొదలై.. సాయంత్రం వరకు సాగింది. ఈ జల్లికట్టులో పాల్గొనేందుకు పరిసర ప్రాంతాల రైతులు తమ ఎద్దులను తీసుకొచ్చారు. వాటికి ఫొటోలు, టీడీపీ, వైసీపీ, జనసేన జెండాలను కట్టి వదిలారు. వేలాదిగా తరలి వచ్చిన యువకులు అల్లె అవతల నిలబడి కోడెగిత్తలను నిలువరించి.. వాటి కొమ్ములకున్న చెక్క పలకలను సొంతం చేసుకొనేందుకు పోటీ పడ్డారు. ఈ క్రమంలో కొందరు యువకుల మధ్య కొన్నిసార్లు ఘర్షణ జరిగింది. పశువుల నిలువరింతలో కిందపడటంతో 40 మందికి పైగా గాయపడ్డారు. చెక్క పలకలను చేజిక్కించుకున్న యువకులు ఉత్సాహంగా కేరింతలు కొట్టారు. క్షతగాత్రులకు అక్కడే ఏర్పాటు చేసిన ప్రాథమిక చికిత్స కేంద్రం లో వైద్యసేవలందించారు. తీవ్ర గాయాలైన వారిని తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. కాగా, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు డీజే మ్యూజిక్‌తో ర్యాలీగా తమ ఎద్దులను జల్లికట్టు ప్రదేశానికి తీసుకొచ్చారు. జల్లికట్టు వీక్షణకు వచ్చిన సినీనటుడు మంచు మనోజ్‌కుమార్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వచ్చిన జనానికి గ్రామస్తులు భోజనం, తాగునీటి సౌకర్యం కల్పించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

వాటర్‌షెడ్ పథకం ఓ వరం : పీడీ



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు పీడీ మల్లికార్జున్

కల్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ పథకం ఓ వరమని అదనపు పీడీ మల్లికార్జున్ తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం బోడిరెడ్డిగారిపల్లి, కల్లూరు, పాతపేట, పాళెం, వెంకటదాసరపల్లి గ్రామాల్లో వాటర్‌షెడ్ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం పథకంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు పీడీ మాట్లాడుతూ భూగర్భ జలాలను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఎక్కడ పడిన వర్షపు నీటి చుక్కను అక్కడే ఇంకేలా చేయడమే పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. వాటర్‌షెడ్ పథకంలో అలసత్వానికి తావులేకుండా పనులను ఎప్పటికప్పుడు సిబ్బంది పర్యవేక్షించాలన్నారు. పథకంతో అందించే సబ్సిడీ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం చేపడుతున్న పనులను పరిశీలించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ శ్రీనివాసులు, పీవో తేజస్విని, టీవోలు షబ్బీర్, దొరైరాజు, రెడ్డిశేఖర్, శాంతి, వాటర్‌షెడ్ చైర్మన్లు, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఫలితాల సాధనకు కృషి



రాత్రివేళల్లో విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయుడు జీవీ.రమణ

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలను సాధించడం కోసం రాత్రుల్లో పర్యవేక్షిస్తున్నామని ఉపాధ్యాయుడు జీవీ. రమణ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించడానికి పాఠశాల హెచ్ఎం రుద్రాణి సూచనల మేరకు ఉపాధ్యాయ బృందాలు గ్రామాల్లోని విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి విద్యార్థులకు సూచనలు చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి రాత్రి 10 గంటల వరకు చదివించాలని కోరుతున్నామని తెలిపారు. పరీక్షలు పూర్తయ్యే వరకు ఇళ్లల్లో టీవీలు పెట్టొదని.. సెల్‌ఫోన్లు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధ్యాయుడు రామకృష్ణనాయక్ పాల్గొన్నారు.

ఎంపీటీసీ కుటుంబానికి పెద్దిరెడ్డి పరామర్శ



ఆనంద్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సదుం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతిచెందిన సదుం ఎంపీటీసీ సభ్యుడు ఆనంద్ కుటుంబాన్ని ఆదివారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పరామర్శించారు. అంతకముందు ఆనంద్ మృతదేహానికి నివాళులు అర్పించారు. జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, జడ్పీటీసీ సోమశేఖర రెడ్డి, ఎంపీపీ ధనంజయ రెడ్డి, నాయకులు ప్రకాశ్ రెడ్డి, మల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నారాయణ తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు.

వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు



వాలీబాల్ పోటీల్లో విజేతలతో నిర్వాహకులు

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శనివారం రాత్రి జరిగిన వాలీబాల్ పోటీల్లో విజేతలకు నిర్వాహకులైన పూర్వవిద్యార్థులు బహుమతులు అందించారు. విన్నర్స్‌గా గెలుపొందిన కోలార్ జట్టుకు రూ. 50,116, రన్నర్స్‌గా నిలిచిన వేలూరు జట్టుకు రూ. 30,116, మూడో బహుమతి సాధించిన పాండిచ్చేరి జట్టుకు రూ. 20,116, నాలుగో బహుమతి సాధించిన ముత్తూరు జట్టుకు రూ.10,116 నగదు బహుమతులు అందించారు. మరో నాలుగు జట్లకు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు.

శాస్త్రోక్తంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ

చౌడేపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఓదులపేటలో గ్రామదేవత ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠను ఆదివారం వేదపండితులు ఆనందస్వామి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ తల్లి

బాటగంగమ్మ ఆలయంలో విశేష పూజలు



విశేషాలంకరణలో బాటగంగమ్మ

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె పట్టణంలో బాటగంగమ్మ జాతర సందర్భంగా ఆదివారం ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు నాగేంద్ర అమ్మవారికి విశేషాలంకరణ చేపట్టారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గాంధీరోడ్డులోని నడివీధి గంగమ్మ, బీసీకాలనీలో పెద్దపులిగంగమ్మ, ఎస్సీకాలనీలో సల్లాపురెమ్మ, పెద్దచెరువు వద్ద కట్టపై గంగమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మోట్లపల్లెలో గడ్డివామి దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చౌడేపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మోట్లపల్లెలోని మునిరాజకు చెందిన గడ్డివామి ప్రమాదవశాత్తు ఆదివారం దగ్ధమైంది. ఇంటి వద్ద నిల్వ చేసిన గడ్డివామిలో మధ్యాహ్నం ఉన్నట్లుండి మంటలు చెలరేగాయి. గుర్తించిన స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక అధికారి సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. సుమారు రూ.30 వేలు విలువైన గడ్డి కాలిపోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

రేపు వెంకటాద్రికాలనీలో ఉచిత వైద్యశిబిరం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18న మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ వెంకటాద్రికాలనీలో కళాకారుల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జానపద వృత్తి కళాకారుల సంఘ నాయకులు తెలిపారు. భీమగానిపల్లె సచివాలయం వద్ద ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులచే పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అమరనాథరెడ్డికి మైనారిటీల సన్మానం

గంగవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పట్టణానికి చెందిన పలువురు మైనారిటీ పెద్దలు, మసీదు ఇమామ్‌లు ఆదివారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పలమనేరు టౌన్, మండల ఖాజీగా ముఫ్తి షేక్‌అబ్దుల్లాను నియమించడంతో పాటు మైనారిటీల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని గుర్తించి ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో ఇమామ్‌లు జుబేర్ అహ్మద్, సయ్యద్ అహ్మద్, అబ్దుల్ రహీం, జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఖాజాపీర్, డాక్టర్ ఖలీల్, షరీఫ్, జుబేర్, జావీద్, ఫైజుల్లా, షఫీబ్, అశ్రఫ్, టీడీపీ నాయకులు ఆర్‌బీసీ కుట్టి, గిరి, నాగరాజు పాల్గొన్నారు.

విద్యుత్ ఉపకేంద్రంలో ఉద్యోగుల ఘర్షణ

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్న ఇద్దరు షిఫ్ట్ ఆపరేటర్లు ఘర్షణ పడిన సంఘటన ఆదివారం పుంగనూరు మండలంలో జరిగింది. మండలంలోని బోడేవారిపల్లెకు చెందిన ప్రసాద్, సోమల మండలం వల్లిగట్లకు చెందిన హరీష్ మండలంలోని కోటగడ్డ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్నారు. గత 10 రోజుల క్రితం ప్రసాద్ భోజనం చేసి వస్తానని హరీష్ ద్విచక్రవాహనాన్ని తీసుకెళ్లాడు. అయితే ద్విచక్రవాహనం తిరిగి రాకపోవడంతో హరీష్ తన ద్విచక్రవాహనం ఇవ్వాలని ప్రసాద్‌పై ఒత్తిడి చేశారు. దీంతో శనివారం రాత్రి ప్రసాద్, హరీష్‌లు ఘర్షణ పడ్డారు. ఈ విషయాన్ని హరీష్ కుటుంబసభ్యులకు తెలియజేయడంతో కుటుంబసభ్యులు ఆదివారం ఉదయం సబ్‌స్టేషన్ వద్దకు చేరుకుని విచారించారు. ద్విచక్రవాహనాన్ని ప్రసాద్ రూ.15 వేలకు కుదవ పెట్టినట్లు గుర్తించారు. మండల విద్యుత్‌శాఖ ఏఈ ధనంజయరావుకు తెలియడంతో ఆయన ఇద్దరిని మందలించారు. అయితే హరీష్ కుటుంబ సభ్యులపై ప్రసాద్ గొడవకు వెళ్లడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు.సబ్‌స్టేషన్లలో పని చేస్తున్న కొంతమంది ఆపరేటర్లు పని దినాల్లో సబ్‌స్టేషన్లలోనే జూదం ఆడుతున్నట్లు విద్యుత్‌శాఖ సిబ్బంది బహిరంగానే మాట్లాడుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సబ్‌స్టేషన్లపై నిఘా ఉంచాలని పలువురు కోరుతున్నారు.

శివరాత్రి ప్రాముఖ్యతపై ప్రచారం



శివరాత్రి ప్రాముఖ్యతను తెలియజేస్తున్న సమితి సభ్యులు

గంగవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26న శివరాత్రి ప్రాముఖ్యతపై మండలంలోని కూర్నిపల్లెలో త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి అధ్యక్షులు భాస్కర్, బాలాజీ ఆదివారం ప్రచారం చేశారు. ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వాణిశ్రీ, జ్యోతి, రెడ్డెమ్మ, ఉదయ్, రేఖ, కళ్యాణి, రాజేంద్ర, హేమంత్ పాల్గొన్నారు.

కాణిపాక ఆలయ అభివృద్ధికి విరాళం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అభివృద్ధి కోసం సత్యసాయి జిల్లా పుట్టపర్తికి చెందిన సునందాదేవి రూ.1,00,000, తమినాడు రాష్ట్రం తిరువళ్లూరు చెందిన శారదాబాయి నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.1,00,166 విరాళంగా అందించారు. విరాళదాతలను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాతలకు స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, రవి పాల్గొన్నారు.

సేవాతత్వమే పరమావధి

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా భక్తులు, కార్యకర్తలు సమాజసేవే పరమావధిగా పనిచేసి బాబా అనుగ్రహం పొందాలని రాష్ట్ర సత్యసాయి సేవా సమితి సమన్వయకర్త శ్యాంప్రసాద్ అన్నారు. ఆదివారం గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సత్యసాయి సేవా సంస్థల కార్యకర్తల సామాజిక సేవల నిర్వహణలో చేపడుతున్న కార్యక్రమాలపై ఆయన సమీక్ష చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవాసమితి, బాలవికాస్, భజన మండలి, మహిళ, యువజన సంఘాలకు బాబా శత సంవత్సర జయంతి సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై ఆయన పలు సూచనలు చేశారు. స్థానిక కామాక్షి అంబికా సమేత అగస్థీశ్వర ఆలయంలో గత మూడు రోజులుగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్యోతిర్లింగ రుద్రాభిషేకం ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమాల్లో సత్యసాయి సేవా సమతి జిల్లా, నగర, డివిజన్ సమితులు, బాలవికాస్, భజన మండలి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

ఎర్రకుంటలో కబ్జాల పంట..!

- విచ్చలవిడిగా చెరువుల ఆక్రమణలు
- విస్తీర్ణం 11 ఎకరాలు.. మిగిలింది ఎకరానే..!
- బోర్లు వేసి మరీ వ్యవసాయం చేస్తున్న వైనం
- విచ్చలవిడిగా వైసీపీ నాయకుల అక్రమాలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు





ఆక్రమణకు గురైన గాజువానిచెరువు, వైసీపీ నాయకులు ఆక్రమించిన ఎర్రకుంట భూమి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నీటితో కళకళలాడాల్సిన పలు చెరువులు, కుంటలు, కాలువలు పుంగనూరు మండలంలో రూపు కోల్పోతున్నాయి. వైసీపీ నాయకులు చెరువులను ఆక్రమించి వ్యవసాయ పొలాలుగా మార్చేస్తున్నారు. గతంలో వైసీపీ అధికారంలో ఉండగా నాయకులు, కార్యకర్తల కన్నుపడితే కబ్జా చేసి దర్జాగా అనుభవిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలు ఆక్రమించుకోవడమే కాకుండా ఏకంగా బోర్లు వేసుకున్నారు. అక్రమంగా విద్యుత్తు సరఫరా సైతం తీసుకుని వ్యవసాయం చేస్తున్నా.. అధికారులు తమకేవీ పట్టవన్నట్లు వ్యవహరించడం గమనార్హం. పుంగనూరు మండలం చంద్రమాకులపల్లె పంచాయతీ యల్లారుబైలు గ్రామ సమీపంలోని ఎర్రకుంట, కాలువ పోరంబోకు మొత్తం విస్తీర్ణం 11 ఎకరాలు ఉండగా... అక్రమార్కుల ఆక్రమణలతో నేడు ఎకరా మాత్రమే మిగిలింది. ఈ చెరువు కింద సుమారు 60 ఎకరాల ఆయకట్టు ఉంది. పలువురు రైతులు ఈ చెరువును నమ్ముకునే వ్యవసాయం చేస్తున్నారు. అయితే అదే గ్రామానికి చెందిన పలుబడి, రాజకీయ బలం కలిగిన వైసీపీ నాయకులు చెరువును పూర్తిగా ఆక్రమించి రెండు బోర్లు వేసి యథేచ్ఛగా వ్యసాయ పొలాలుగా మార్చుకున్నారు. చెరువుతోపాటు పంట కాలువలు సైతం చదును చేసుకున్నారు. ఆయకట్టు రైతులు తెగించి అడిగితే వారి పొలాల్లోకి వెళ్లడానికి దారి లేకుండా చేయడం, వారిపై దాడి చేసి పోలీసు కేసులు పెడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు, పోరంబోకు, కాలువ భూములను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో రోజురోజుకు ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుంట ఆక్రమణలు తొలగించి ఆయకట్టు భూములకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు రామును వివరణ కోరగా రెండు రోజుల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించి సర్వేచేయిస్తామని.. వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి



పుంగనూరులో నివాళులర్పిస్తున్న బలిజ సంఘ నాయకులు



సోమల మండలం కందూరులో..

పుంగనూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను పుంగనూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. భీమగానిపల్లె బస్టాండ్ క్రాస్, స్థానిక ఇందిరాసర్కిల్‌లో శ్రీకృష్ణదేవరాయుల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో బలిజ సంఘనాయకులు పూల త్యాగరాజు, నానబాల గణేశ్, మధుసూదన్ రాయల్, ప్రకాశ్,రమణ, నరేంద్ర, గంగాధర్, నరేశ్, ఆనంద, యుగంధర్, పూల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● సోమల: శ్రీకృష్ణ దేవరాయులు జయంతి వేడుకలు కందూరు బస్టాండ్‌లో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ హరినారాయణ, కామిశెట్టి నగేశ్, బండాకె రఘు, వీవీ. రమణ, విశ్వనాథం, డీజల్ శంకర్, కోన రాజశేఖర్ చిన్నోడు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాజ్యమేలిన అక్రమాలు, దౌర్జన్యాలు: టీడీపీ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో అక్రమాలు, దౌర్జన్యాలు రాజ్యమేలాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన హింస, అరాచకం, దౌర్జన్యం, ప్రజల గొంతునొక్కడం, భూ ఆక్రమణలు, ప్రజా ధనాన్ని లూటీ చేయడం వంటి ప్రజా స్వామ్యాన్ని ఖూనీచేసే విధానాలను కూటమి ప్రభుత్వానికి ఆపాదించడం సిగ్గుచేటని చెప్పారు. జీవో నెంబర్ 1ను తీసుకువచ్చి కఠినంగా అమలు చేసి ప్రతిపక్షాలను, ప్రజా సంఘాలను, పౌరులను రోడ్ల మీదకు రానీయకుండా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడకుండా అణచివేత చర్యలు చేపట్టి తీవ్రంగా వేధించి నియంత పాలన సాగించారని చెప్పారు. పోలీసు వ్యవస్థను తమ రాజకీయ అవసరాల కోసం, ప్రతిపక్ష నాయకులపైన, ప్రజా సంఘాల నాయకులపైన కక్ష సాధింపు చర్యలకోసం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. వైసీపీ పాలన అంతా అరాచకమయం, దోపిడీమయం, నేరాల మయమేనని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలుచేస్తూ, చట్టబద్ధమైన పాలన కొనసాగుతోందని వివరించారు. నేతలు మోహన్ రాజ్, యువరాజు పాల్గొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పిగానిపల్లి సమీపంలో వెలసివున్న కందగిరికొండలో ఆదివారం ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో ద్వితీయ పుష్కర కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ నిర్వహించి, మూలస్థానం మహా కుంభాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నేతలు చంద్రప్రకాష్, బాలాజీ నాయుడు, హేమాద్రినాయుడు, ప్రతాప్‌నాయుడు, మురళీనాయుడు, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, ఆనంద్ యాదవ్, హరి, బలరామ్, రఘునాథ నాయుడు, శంకర్ చౌదరి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు బైరెడ్డిపల్లెలో ఉచిత కంటి వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలోని అగస్తి స్కూల్ ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, మొగసాల ట్రస్టు సహకారంతో బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి వైద్యులచే ఈనెల 18న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎంపీపీ రెడ్డెప్ప ఓ ప్రకటనలో తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాటర్‌షెడ్ చైర్మన్‌పై వైసీపీ నాయకుడి దాడి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ చైర్మన్‌పై వైసీపీ నాయకుడు దాడి చేసిన సంఘటన ఆదివారం చౌడేపల్లె మండలంలో జరిగింది. వివరాలిలా... చౌడేపల్లె మండలం పరికిదొన పంచాయతీ మొరంకిందపల్లెకు చెందిన మునస్వామి గ్రామ సమీపంలోని కుంటిగంగమ్మ ఆలయం వద్ద శుభ్రం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు వెంకటరెడ్డి దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. గాయపడిన మునస్వామిని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గతంలో తనను వైసీపీలోకి రావాలని ఇబ్బందులు పెట్టినా తాను పార్టీ మారకపోవడంతో తనపై కక్ష కట్టినట్లు తెలిపారు. ఉదయం తాను ఒంటరిగా ఉన్నట్లు గుర్తించి దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రైతు ఆత్మహత్య



మృతిచెందిన వెంకటరణప్ప

గంగవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిమాకులపల్లె గ్రామానికి చెందిన వెంకటరమణప్ప(63) ఉండె నొప్పి భరించలేక ఆదివారం పొలం వద్దకు వెళ్లి జిల్లేడు పాలు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

గుండెపోటుతో సీనియర్ టీడీపీ నేత మృతి

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత ఎన్.భగవాన్ నాయుడు ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు అన్నారు. మండల పరిధిలోని సదకుప్పం గ్రామానికి చెందిన భగవాన్ నాయుడికి శనివారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు అరగొండలోని అపోలో ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందారని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలిసిన జయప్రకాష్ నాయుడు ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి భగవాన్ నాయుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు జయచంద్ర నాయుడు, ఎన్‌పీ ధరణి, రమేష్, గిరిబాబు, లోకేష్, జనార్ధన్ గౌడ్ పాల్గొన్నారు.

విఘ్నేశ్వర పూజతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో ఆదివారం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు విఘ్నేశ్వర పూజతో ప్రారంభమయ్యాయి. గ్రామ దేవత దుర్గాంబకు అభిషేకం, పూజలు, గ్రామోత్సవం, వాస్తుశాంతి, అంకురార్పణం, రక్షాబంధనం నిర్వహించారు. దుడ్డు క్రిష్ణమూర్తి, ఉభయదారులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యేచే ప్రారంభోత్సవాలు

గుడిపాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రూ.7 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చేతులమీదుగా ప్రారంభించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి కొత్తకోట, సీఎం కొత్త ఇండ్లు, వెంగమాంబపురం గ్రామాల్లో సీసీ రోడ్లు, 197 రామాపురంలో ప్రహరీగోడ, క్రిష్ణజిమ్మాపురం, గొల్లపల్లి, బందార్లపల్లి, రాగిమానిపట్టెడలో సీసీ రోడ్లు, కుప్పిగానిపల్లెలో గ్రామ సచివాలయం, మరకాలకుప్పం, గట్రాళ్ల మిట్ట, మండిక్రిష్ణాపురంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు.

గ్రామాల్లో పేదలకు ఉచిత వైద్యసేవలు



కంటి రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది



కల్లూరులో రోగులకు వైద్య పరీక్షలు



సోమల మండలం నంజంపేటలో..

కుప్పం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సాయి మాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి వారిచే ఆదివారం కుప్పంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మెగా ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. మొత్తం 160 మంది కంటి రోగులను పరీక్షించారు. వీరిలో 40 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఎంపిక చేసిన వారికి బెంగళూరులోని శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. ఈ శిబిరంలో కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది విజయ్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

● కల్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. తిరుపతి రమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ వ్యాధులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 10 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. డాక్టర్ వెంకటేష్, సిబ్బంది మనోహర్, భాను, మణెమ్మ, నిఖిల తదితరులు పాల్గొన్నారు.

● రామకుప్పం: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం పీఈఎస్ వైద్య కళాశాల ఆసుపత్రి, రామకుప్పం సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కమిటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 50 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సంజన, కీర్తి, ప్రియాంక, ఆలయ కమిటీ పెద్దలు సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

● సోమల: బెంగళూరు వైదేహి వైద్యశాలకు చెందిన నిపుణులు గ్రామీణ ప్రాంతంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమని సీనియర్ టీడీపీ నాయకుడు, మాజీ ఐడీసీ డైరెక్టర్ వైసాంబయ్య, జనసేన మండలాధ్యక్షుడు నాగభూషణం రాయల్ తెలిపారు. ఆదివారం నంజంపేటలో జరిగిన ఉచిత వైద్యశిబిరంలో 120 మందికి వివిధ వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మురళీ, ప్రసాద్, జాఫర్, చాన్‌బాషా, పవన్, కిషోర్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలం దిగువమాసాపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ప్రారంభించారు. చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నాయకులు చంద్రప్రకాష్, మోహన్‌రాజ్, శశికర్‌బాబు, రఘు, జగదీష్ నాయుడు, మేషాక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉయ్యాలచింతలో వినాయక స్వామి ఆలయ వార్షికోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

క్రీడలతో ఆనందం.. ఆరోగ్యం

చిత్తూరు క్రీడలు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): క్రీడలతో ఆనందం, ఆరోగ్యంగా ఉంటామని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం చిత్తూరులోని మెసానికల్ ఇన్‌డోర్ మైదానంలో షటిల్ కోర్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామం శరీరానికి ఉత్తేజానిస్తుందన్నారు. దీంతో ఆరోగ్యంగా ఉంటామన్నారు. అనంతరం కాసేపు షటిల్ ఆడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల 'అపూర్వ' కలయిక



హెచ్‌ఎంకు డెస్క్‌లను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నలభై ఏళ్ల క్రితం చదివిన పాఠశాలలో పూర్వ విద్యార్థుల కలయికకు వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాల వేదికైంది. ఆదివారం 1984-85 సంవత్సరం పదో తరగతి విద్యార్థుల బ్యాచ్ అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు నాటి గురువులను సన్మానించారు. అలనాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులు, ఉపాధ్యాయుల సౌకర్యార్థం 12 డెస్కులను ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులుకు అందజేశారు. ఒకరినొకరు ఆప్యాయతగా పలకరించుకున్నారు.

మంత్రి లోకేష్‌కు ఘన స్వాగతం



మంత్రి లోకేష్‌తో భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా పర్యటన కోసం తిరుపతి విమానాశ్రయానికి వచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదివారం ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యల గురించి భానుప్రకాష్‌తో లోకేష్ చర్చించారు.

కూటమి ప్రభుత్వంలో అరాచకాలుండవు



థామస్‌ను సన్మానిస్తున్న జనసేన నాయకులు

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అవినీతి, అరాచకాలు ఉండవని ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్ అన్నారు. ఎమ్మెల్యే థామస్ ప్రభుత్వ విప్ అయిన సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్‌ఆర్‌పురం మండలం పుల్లూరులో సర్పంచ్ భవశ్రీ, పవన్, మండల అధ్యక్షుడు చిరంజీవి ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వమని, వాట్సా‌ప్‌లో సమస్య చెప్పిన వెంటనే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇంచార్జి పొన్న యుగంధర్, నాయకులు సుమన్, రాఘవ, టీడీపీ నాయకులు గుండయ్య, వెంకటేష్, వెంకటాచాలం, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (సీఓఈఏ) జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, గౌరవాధ్యక్షుడు గంజి రామమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం రెవెన్యూ భవన్‌లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘ నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేస్తున్నట్లు మంత్రివర్గ సమావేశంలో తీర్మానించడం వల్ల ఉద్యోగులను రోడ్డున పడేసినట్లేనని అన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సీనియారిటీని బట్టి ఏడాదికోసారి ఇంక్రిమెంట్లు వేయాలని కోరారు. ఆ సంఘ కోశాధికారి రెడ్డిగోపాల్, నేతలు హేమలత, సురేష్‌కుమార్, ఉమాపతి, ముఖేష్, ధనంజయులు, కనకరాజ్, తదితరులు పాల్గొన్నారు.

108లో ఆడ బిడ్డ జననం



108లో ప్రసవించిన గర్భిణి

విజయపురం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్షూరికాపురం వద్ద 108లో గర్భిణి రేవతి ఆదివారం మధ్యాహ్నం ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. మండలంలోని కళియంబాకం దళితవాడకు చెందిన అన్నామలై భార్య రేవతికి పురిటి నొప్పులు రావడంతో 108కు ఫోన్ చేశారు. ఆమెను 108లో తరలిస్తుండగా క్షూరికాపురం వద్ద ప్రసవించడంతో ఆడ బిడ్డ జన్మించిందని ఈఎంటీ గ్రాస్, పైలెట్ నర్సింహులు తెలిపారు.

ఇసుక లారీ సీజ్

గుడిపాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా నుంచి తమిళనాడుకు వెళ్తున్న ఇసుక లారీని ఆదివారం సీజ్‌చేసినట్లు గుడిపాల ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. కర్నూలు నుంచి చెన్నై వైపుకు గుడిపాల మీదుగా వెళ్తున్న ఇసుక లారీని మార్గమధ్యమైన ఎంసీఆర్ క్రాస్ వద్ద తనిఖీలు చేస్తుండగా సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బోల్తా పడిన మినీ వ్యాన్

● తృటిలో తప్పిన పెనుప్రమాదం



బోల్తా పడిన మినీ వ్యాన్

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సిమెంట్ బండరాళ్లు తరలిస్తున్న మినీ వ్యాన్ బోల్తా పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు బంగారుపాళ్యం నుంచి పళ్లిపట్టు వైపు సిమెంట్ బండరాళ్లు తీసుకు వస్తున్న మినీ వ్యాన్ మార్గ మధ్యంలో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై మెదవాడ సమీపంలో టైరు పేలి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. రోడ్డుపై ఎలాంటి వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

కాణిపాక ఆలయ అభివృద్ధికి విరాళం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అభివృద్ధి కోసం సత్యసాయి జిల్లా పుట్టపర్తికి చెందిన సునందాదేవి రూ.1,00,000, తమినాడు రాష్ట్రం తిరువళ్లూరు చెందిన శారదాబాయి నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.1,00,166 విరాళంగా అందించారు. విరాళదాతలను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దాతలకు స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

జర్మనీలో ఇళ్లత్తూరువాసి మృతి



భార్గవి (ఫైల్ ఫొటో)

విజయపురం, ఫిబ్రవరి 16: జర్మనీ దేశంలో మృతి చెందిన విజయపురం మండలం ఇళ్లత్తూరు వాసి సుబ్రహ్మణ్యం కుమార్తె భార్గవి(35)కి ఆదివారం తమిళనాడులోని చెంగల్‌పట్టులో దహనక్రియలు నిర్వహించారు. ఇళ్లత్తూరుకు చెందిన సుబ్రహ్మణ్యం కుమార్తె భార్గవి సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా జర్మనీలో స్థిరపడింది. అక్కడే స్థిరపడ్డ చెంగల్‌పట్టుకు చెందిన శాస్త్రవేత్తను 8 సంవత్సరాల క్రితం వివాహమాడింది. అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం భార్గవి మృతి చెందింది. శనివారం రాత్రి 10 గంటలకు చెన్నైకి తీసుకొచ్చారు. ఆదివారం చెంగల్‌పట్టులో దహన క్రియలు నిర్వహించారు.

ఏడు పాడి ఆవుల చోరీ

తవణంపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఏడు పాడి ఆవులు చోరీకి గురైన సంఘటన మండలంలో శనివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ చిరంజీవి కథనం మేరకు వివరాలు. మండలంలోని తవణంపల్లెలో లోకేష్, ప్రకాష్‌కు చెందిన రెండు పాడి ఆవులు, ఎగువ తవణంపల్లెలో వినోద్‌రెడ్డి, నాయుడు, విశ్వనాథరెడ్డికి చెందిన మూడు ఆవులు, మిట్టపల్లెలో మణికి చెందిన ఒక ఆవు, తడకర ముత్యాలమిట్టలో చంటికి చెందిన ఒక ఆవును గుర్తు తెలియని దొంగలు శనివారం అర్ధరాత్రి చోరీ చేశారు. తడకర ముత్యాలమిట్టకు చెందిన టి.చంటి తన పాడి ఆవు చోరీకి గురైనట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సరస్వతి దేవి విగ్రహం ఏర్పాటు

పాలసముద్రం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజకండ్రిగ జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. 1992-93వ సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఈ విగ్రహాన్ని పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా అర్చకులు నవకలశాలను ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రఘు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయలు జయంతి

తవణంపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరగొండ పైమాఘంలో శ్రీకృష్ణదేవరాయలు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అరగొండ పాత బస్టాండు వద్ద గల శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని పూల మాలలతో అలంకరించి, పాలాభిషేకం నిర్వహించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్‌శెట్టి, గిరిష్, పద్మనాభశెట్టి, గోవిందశెట్టి, రఘుపతి, మోహన్, పైమాఘం గ్రామస్తులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న నిర్వాహకులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 26వ తేదీన జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేద్దామని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు. ఆదివారం కార్వేటినగరం శిష్ట సౌందర్యవల్లి సమేత సదా శివేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్వాహకులు సమావేశమయ్యారు. ఉత్సవ ఏర్పాట్లు, భక్తులకు అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కేఎం కోదండపాణి మొదలియార్, కోశాధికారి ఎం.రాజేంద్రరెడ్డి, కమిటీ సభ్యులు, ఇతర కార్యనిర్వాహకులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీగణపతి ఆలయ మహాకుంభాభిషేకం

పూతలపట్టు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవనాయనివూరులో నూతనంగా నిర్మించిన లక్ష్మీగణపతి ఆలయ మహాకుంభాభిషేక మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు పలురకాల పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి నాయుడు, గుంటూరు మురళితో పాటు గ్రామపెద్దలు, గ్రామస్థులు, కార్యనిర్వాహకులు పాల్గొన్నారు.

జగన్ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాడు: టీడీపీ

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు 2019లో ఒక్కఛాన్స్ ఇస్తేనే అధికారంలోకి వచ్చిన జగన్ ఆంధ్రరాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసి భ్రష్టుపట్టించారని పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి కామసాని కోదండరెడ్డి, పార్లమెంట్ టీఎస్ఎన్ఎఫ్ అధికార ప్రతినిధి కేతినేని లోకేష్ నాయుడు, నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనారిటీ ప్రధానకార్యదర్శి నియాజ్ అలీ, మండల టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు జ్యోతియాదవ్, నియోజకవర్గ టీఎన్‌టీయుసీ ప్రధానకార్యదర్శి బోడిరెడ్డి రుషేంద్రరెడ్డిలు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. ఇటీవల తాడేపల్లె ప్యాలెస్‌లో జరిగిన వైసీపీ సమావేశంలో మళ్లీ తాను సీఎం అయితే 30ఏళ్లు అధికారం చలాయిస్తానని జగన్‌రెడ్డి పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల కాలంలో జగన్ రాష్ట్రం కోసం చేసేందేమీ లేదని విమర్శించారు.

అరకొరగా రోడ్డు పనులు

● పూతలపట్టులో ప్రయాణికులకు ఇబ్బందులు



రోడ్డుపైన అడ్డదిడ్డంగా ఉన్న ఆటోలు

పూతలపట్టు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పూతలపట్టులో రోడ్డుపనులను అరకొరగా చేయడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. చిత్తూరు-కడప జాతీయ రహదారిలోని పూతలపట్టులో గతంలో అంబేడ్కర్ విగ్రహం ఉండేది. రోడ్డు వెడల్పులో భాగంగా ఓ కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహం తొలగింపు విషయమై కొంత ఆలస్యం కావడంతో కాంట్రాక్టర్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద రోడ్డు పనులు చేపట్టకుండా వదిలేశారు. కొన్నిరోజుల తర్వాత కొంతమంది దళితనేతలు అంబేడ్కర్ విగ్రహాన్ని స్వచ్ఛందంగా తీసి వేరే స్థలంలో ఏర్పాటు చేశారు. ఈ విషయం జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులకు తెలిసింది. కానీ కాంట్రాక్టర్ మాత్రం సంవత్సరాలు గడుస్తున్నా అక్కడ రోడ్డుపనులు పూర్తిచేయలేదు. దీంతో కంకర తేలిపోవడంతో వాహనాలు వచ్చినప్పుడు కంకరరాళ్లు ఎగిరి పాదచారులు, వాహనదారులపై పడుతున్నాయి. ఆటోడ్రైవర్లు తమ వాహనాలను ఎక్కడబడితే అక్కడ ఆపేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుపనులు పూర్తిచేయించి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైసీపీ పాలనలో రాజ్యమేలిన అక్రమాలు, దౌర్జన్యాలు: టీడీపీ

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో అక్రమాలు, దౌర్జన్యాలు రాజ్యమేలాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన హింస, అరాచకం, దౌర్జన్యం, ప్రజల గొంతునొక్కడం, భూ ఆక్రమణలు, ప్రజా ధనాన్ని లూటీ చేయడం వంటి ప్రజా స్వామ్యాన్ని ఖూనీచేసే విధానాలను కూటమి ప్రభుత్వానికి ఆపాదించడం సిగ్గుచేటని చెప్పారు. జీవో నెంబర్ 1ను తీసుకువచ్చి కఠినంగా అమలు చేసి ప్రతిపక్షాలను, ప్రజా సంఘాలను, పౌరులను రోడ్లమీదకు రానీయకుండా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడకుండా అణచివేత చర్యలు చేపట్టి తీవ్రంగా వేధించి నియంత పాలన సాగించారని చెప్పారు. పోలీసు వ్యవస్థను తమ రాజకీయ అవసరాల కోసం, ప్రతిపక్ష నాయకులపైన, ప్రజా సంఘాల నాయకులపైన కక్ష సాధింపు చర్యలకోసం దుర్వినియోగం చేశారని ఆరోపించారు. వైసీపీ పాలన అంతా అరాచకమయం, దోపిడీ మయం, నేరాల మయమేనని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలుచేస్తూ, చట్టబద్ధమైన పాలన కొనసాగుతోందని వివరించారు. నేతలు మోహన్‌రాజ్, యువరాజు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్‌తో బాధితులకు ఆర్థిక చేయూత

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రిలీఫ్‌ఫండ్‌తో బాధితులకు ప్రభుత్వం తరఫున ఆర్థికంగా చేయూత అందిస్తున్నట్లు ప్రభుత్వవిప్ డాక్టర్ థామస్ పేర్కొన్నారు. గంగాధరనెల్లూరు మండలం నెల్లేపల్లె పంచాయతీ పెద్దమిట్టపల్లెకు చెందిన సుబ్రమణ్యంరెడ్డి రోడ్డు ప్రమాదానికి గురై కాలుకు ఆపరేషన్ చేయించుకున్నారు. దీంతో ఆయన సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. సుబ్రమణ్యంరెడ్డికి విడుదలైన సీఎం రిలీఫ్‌ఫండ్ రూ.3.05లక్షల చెక్‌ను నేతలతో కలిసి ఆదివారం శ్రీరంగరాజుపురం మండలంలో థామస్ పంపిణీచేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేతలు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, శ్రీధర్‌యాదవ్, స్వామిదాస్, జనసేన ఇన్‌చార్జి పొన్నా యుగంధర్, హరీష్‌యాదవ్, జమీర్, యువరాజ్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం(ఆంధ్రజ్యోతి): శ్రీరంగరాజుపురం మండలం పాతపాళెం గ్రామానికి చెందిన వెంకటేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే థామస్ పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. వెంకటేష్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగావకాశం కల్పిస్తానని ఆయన హామి ఇచ్చారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్మోహన్, దొరబాబు, చంద్రప్రకాష్, సుబ్రహ్మణ్యం నాయుడు

గుడిపాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పిగానిపల్లి సమీపంలో వెలసివున్న కందగిరికొండలో ఆదివారం ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో ద్వితీయ పుష్కర కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ నిర్వహించి, మూలస్థానం మహాకుంభాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నేతలు చంద్రప్రకాష్, బాలాజీ నాయుడు, హేమాద్రి నాయుడు, ప్రతాప్‌నాయుడు, మురళీనాయుడు, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, ఆనంద్ యాదవ్, హరి, బలరామ్, రఘునాథ నాయుడు, శంకర్ చౌదరి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సేవాతత్వమే పరమావధి



మాట్లాడుతున్న శ్యాం ప్రసాద్

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా భక్తులు, కార్యకర్తలు సమాజసేవే పరమావధిగా పనిచేసి బాబా అనుగ్రహం పొందాలని రాష్ట్ర సత్యసాయి సేవా సమితి సమన్వయకర్త శ్యాంప్రసాద్ అన్నారు. ఆదివారం గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సత్యసాయి సేవా సంస్థల కార్యకర్తల సామాజిక సేవల నిర్వహణలో చేపడుతున్న కార్యక్రమాలపై ఆయన సమీక్ష చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవాసమితి, బాల వికాస్, భజన మండలి, మహిళ, యువజన సంఘాలకు బాబా శత సంవత్సర జయంతి సందర్భంగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై ఆయన పలు సూచనలు చేశారు. స్థానిక కామాక్షి అంబికా సమేత అగస్తీశ్వర ఆలయంలో గత మూడు రోజులుగా సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్యోతిర్లింగ రుద్రాభిషేకం ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమాల్లో సత్యసాయి సేవా సమితి జిల్లా, నగర, డివిజన్ సమితులు, బాలవికాస్, భజన మండలి సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించండి

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో మాట్లాడి న్యాయంచేయాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రభావతి, ప్రేమ కోరారు. ఆదివారం వారు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న తమకు పనికితగ్గ వేతనం ఇవ్వడంలేదన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలు గడవడం కష్టంగా ఉందన్నారు. చిత్తూరు నియోజకవర్గంలో 131 కేంద్రాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల మాదిరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలన్నింటినీ అసెంబ్లీలో ప్రస్తావించి తమకు న్యాయం చేయాలని కోరారు. పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

15 నుంచి పొన్నియమ్మ ఆలయ మహా కుంభాభిషేకం



మాట్లాడుతున్న సి.కె.లావణ్య బాబు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పొన్నియమ్మ ఆలయ మహా కుంభాభిషేక కార్యక్రమాలు మార్చి 15 నుంచి 17వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టీ సి.కె.లావణ్య బాబు తెలిపారు. ఆదివారం ఆమె ఆలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ అమ్మవారి ఆలయ మహా కుంభాభిషేకం మూడు రోజుల పాటు నిర్వహిస్తామని, ఉత్సవాల్లో పాల్గొనదలిచిన దంపతులు ఆలయ మేనేజర్ విజయ్‌కుమార్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కుంభాభిషేకంలో పాల్గొనే మహిళా భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించాలని కోరారు. సంగీతం, కూచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని పేర్కొన్నారు. ఆలయ అర్చకులు కేదారేశ్వరన్, హేమంత్‌కుమార్, వెంకటేష్, రవి, సుబ్బు, సత్య, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ సీనియర్ నేత మృతి



భగవాన్ నాయుడు (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత ఎస్.భగవాన్ నాయుడు ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ నాయుడు అన్నారు. మండల పరిధిలోని సదకుప్పం గ్రామానికి చెందిన భగవాన్ నాయుడికి శనివారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు అరగొండలోని అపోలో ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందారని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలిసిన జయప్రకాష్ నాయుడు ఆదివారం ఆ గ్రామానికి వెళ్లి భగవాన్ నాయుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు జయచంద్ర నాయుడు, ఎన్‌పీ ధరణి, రమేష్, గిరిబాబు, లోకేష్, జనార్ధన్ గౌడ్, కోకా ప్రకాష్ నాయుడు పాల్గొన్నారు.

విఘ్నేశ్వర పూజతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర ఆలయంలో ఆదివారం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు విఘ్నేశ్వర పూజతో ప్రారంభమయ్యాయి. గ్రామ దేవత దుర్గాంబకు అభిషేకం, పూజలు, గ్రామోత్సవం, వాస్తుశాంతి, అంకురార్పణం, రక్షాబంధనం నిర్వహించారు. దుడ్డు క్రిష్ణమూర్తి, ఉభయదారులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యేచే పలు ప్రారంభోత్సవాలు

గుడిపాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రూ.7 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ చేతులమీదుగా ప్రారంభించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి కొత్తకోట, సీఎం కొత్త ఇండ్లు, వెంగమాంబపురం గ్రామాల్లో సీసీ రోడ్లు, 197 రామాపురంలో ప్రహరీగోడ, క్రిష్ణజిమ్మాపురం, గొల్లపల్లి, బందార్లపల్లి, రాగిమానిపట్టెడలో సీసీ రోడ్లు, కుప్పిగానిపల్లెలో గ్రామ సచివాలయం, మరకాలకుప్పం, గట్రాళ్లమిట్ట, మండిక్రిష్ణాపురంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు.

సిద్ధి సమాధి యోగా వ్యవస్థాపకుడి వర్ధంతి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఎస్‌వై నిర్వాహకులు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): స్థానిక తపోవనం వృద్ధాశ్రమంలో ఆదివారం సిద్ధి సమాధి యోగా వ్యవస్థాపకులు ప్రభాకర్ 12వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నగర సిద్ధి సమాధి యోగా గురువు నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలోని వృద్ధులకు నూతన వస్త్రాలు, స్వీట్స్ పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధులకు యోగ సాధనపై అవగాహన కల్పించి, యోగాసనాలు, ధ్యానం చేయించారు. బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా నాటుసారా తయారీ

● పట్టించుకోని పోలీసులు



నరసింహాపురంలో తాగునీటి బోరు వద్ద పడేసిన నాటుసారా కవర్లు

పాలసముద్రం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాటుసారా తయారీ, అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. నరసింహాపురం, గంగమాంబాపురం, బాలకృష్ణాపురం పంచాయతీల్లో నాటుసారా తయారీ ఎక్కువగా సాగుతోంది. ఎక్సైజ్, సివిల్ పోలీసులు నామమాత్రంగా దాడులు నిర్వహిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. పలు గ్రామాల్లో 250 మి.లీ నాటు సారా ప్యాకెట్లను రూ.100 చొప్పున విక్రయిస్తున్నారు. నాటుసారా తాగిన వారు ఖాళీ ప్లాస్టిక్ కవర్లను రోడ్డు పక్కన, పంట పొలాల వద్ద విచ్చలవిడిగా పడేస్తున్నారు. నాటుసారా తయారు చేసి విక్రయించే వారికి మంచి లాభాలు వస్తుండటంతో కొంత మంది యువకులు దానినే వృత్తిగా చేసుకుంటున్నారు. నాటుసారా తయారీ, అమ్మకాల వలన తరచూ గ్రామాల్లో చిన్నచిన్న ఘర్షణలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాటుసారా తయారీ, అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంటిపన్ను చెల్లింపులకు సహకరించండి

పెనుమూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు పంచాయతీలో నివసిస్తున్న ప్రజలు ఇంటిపన్ను, ప్రైవేటు కుళాయి కనెక్షన్ తీసుకున్న వారు సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, పెనుమూరు సెక్రటరీ ప్రభుకిరణ్ ఓ ప్రకటనలో కోరారు. పన్ను చెల్లించిన వారికి రశీదులు అందజేస్తామని, అందులో కుళాయి ఫీజు, లైసెన్సు ఫీజులు నమోదు చేసి ఉంటుందని, దానిని గమనించాలని పేర్కొన్నారు. రశీదు ఇవ్వకుండా ఎవరైనా పన్నులు వసూలు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని వారు సూచించారు. బకాయిలు ఉన్న వారికి ఇచ్చే డిమాండ్ నోటీసులో వివరాలు ఉంటాయని అన్నారు. ఏడాదికి కుళాయి ఫీజు రూ.360 కట్టాల్సి ఉంటుందని వారు స్పష్టం చేశారు.